

# కథ కాని కథ

"మీ మేనమామగారు చనిపోయారట. వేటపాలెం నుంచి ఫోన్ వచ్చింది." అంటూ "పాపం! పెద్దాయన! దాదాపు ఎనభై అయిదు ఏళ్ళకు పైనే ఉంటాయేమో" సానుభూతిగా అంది శ్రీమతి.

స్కూలు నుంచి వచ్చేటపుడు జోరున ఒకటే వాన. పూర్తిగా తడిసిపోయాను. బట్టలు మార్చుకుని వాలు కుర్చీలో కూర్చుని గతంలోకి వెళ్లాను. చిన్నప్పటి నుంచీ మాకు తెలిసిన దగ్గర బంధువులు వాళ్లే. 'చివరిసారిగా శవాన్ని చూసి వస్తే అదో తృప్తిగా ఉంటుంది. వెంటనే వెళ్లాలి' – లేచి, ప్రయాణానికి సిద్ధపడ్డాను.

"శుక్రవారం సాయంత్రం పూట అంతదూరం ప్రయాణం చేయడం ఎందుకు? రేపు ఉదయం పోతే సరిపోదా?" అంటున్న శ్రీమతి మాటలు పట్టించుకోకుండా బయలుదేరిన నేను వేటపాలెం చేరేసరికి రాత్రి పది గంటలయింది.

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావం వలన రాబోవు 48 గంటలలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించిందట. శవవాహకులుగా ఎవ్వరూ దొరికినట్లు లేరు. కర్మకాండలు జరిపించే బ్రాహ్మణుడు మర్నాడు వస్తానని చెప్పాడట. అందువలన శవదహనాది కార్యక్రమాలను మరుసటి రోజుకు వాయిదా వేసుకున్నారు.

మరుసటి రోజు చెప్పిన మాట ప్రకారం బ్రాహ్మణుడు వచ్చాడు. నేను, దగ్గర బంధువులు మరో ముగ్గురూ శవవాహకులుగా అతికష్టం మీద స్మశానానికి చేరాం. కుండపోత వర్షం. కార్యక్రమాలకు అంతరాయం కలగకుండా రేకులషెడ్డు క్రింద దహన సంస్కారాది కృత్యాలు నిర్వర్తించారు.

చూస్తుండగానే మంటలు మామయ్యను కబళించివేసాయి. నిర్వేదంతో నిట్టూర్చేను. సాయంత్రానికి ఎవరి యిళ్ళకు వాళ్ళం బయలుదేరాం. వర్షంలో తడవడం, రేవులో పలుమార్లు మునగడం కారణంగా నాకు మూడు రోజులు విపరీతమైన జ్వరం. స్కూలుకు సెలవు పెట్టాను. అస్వస్థత కారణంగా మళ్ళీ వేటపాలెం పోవడం కుదరలేదు.

రోజులు గడిచిపోతున్నాయి. మా మేనమామ గతించి రెండేళ్ళు పూర్తిగావస్తున్నాయి. మధ్యలో ఏదో పనిమీద మా మేనమామ కొడుకు వెంకటేష్ రెండు మూడు సార్లు మా యింటికి వచ్చి వెళ్ళాడు. వచ్చినపుడల్లా ఆత్మీయంగా ఆదరించాము.

★ ★ ★

కొన్ని ప్రయాణాలు అనివార్యం. మా పెదనాన్న కొడుకు పెళ్లికి హాజరు కావడానికి కుటుంబ సమేతంగా నెల్లూరుకు చేరాం. కళ్యాణమండపం బంధువులతో ఎంతో సందడిగా ఉంది. మాటల సందర్భంలో మా అన్న "ఎల్లుండి వేటపాలెంలో రమేష్ ఉపనయం కదా! ఎప్పుడు బయలుదేరుతావ"ని అడిగాడు. నాకు ఆశ్చర్యమేసింది. అసలు ఆ సంగతే నాకు తెలియదు! "ఇప్పుడే వింటున్నాన"ని అనేసరికి మా అన్న అవాక్కయ్యాడు.

అంతకుముందు వాళ్ళింటికి శుభకార్యాలకు హాజరయిన సందర్భాలు చాలా ఉన్నాయి. ఎవరైనా ఆహ్వానిస్తే ఆ ఫంక్షన్స్‌కి ఠంచనుగా హాజరవుతాను. ఇటీవల నా శ్రీమతి తీవ్ర అనారోగ్యానికి గురయినపుడు బంధువులు అందరూ చూడ్డానికి వచ్చారు. వేటపాలెం నుంచి ఎవ్వరూ రాలేదు. వారికి బంధువుల ద్వారా విషయం తెలుస్తుందని నాకు బాగా తెలుసు.

**తిప్పావఝ్ఝల సీతా సుబ్రహ్మణ్యం**

**మొదటి కథ**

కానీ వారికుండే యిబ్బందుల దృష్ట్యా రాలేదు కాబోలు అని సరిపెట్టుకున్నాను.

కొందరు బంధువుల ద్వారా ఆలస్యంగా తెలిసిన విషయం ఏమిటంటే... టాక్సీ బాడుగకు తీసికొని వెంకటేష్ భార్యతో సహా అందరి బంధువుల ఊళ్లకూ పోయి, కుమారుని ఉపనయనానికి ఆహ్వానించటం.

పెళ్లికి వచ్చిన మేము సాయంత్రం ఊరికి పోవటానికి బస్టాండులో బస్సు ఎక్కుతూంటే, వెంకటేష్ గబగబా నా దగ్గరకు వచ్చి "ఎల్లుండి రమేష్ ఉపనయనం. రేపు మీ ఊరు వస్తా... ఇంట్లోనే ఉంటారు గదా" అని అడిగాడు. తలూపాను. నా శ్రీమతి మౌనంగా చూస్తుండి పోయింది. బస్సులో కూర్చుని వాళ్ల వింత మనస్తత్వం గురించి ఆలోచిస్తున్నాను. బస్సు వెళ్తూనే ఉంది.

★ ★ ★

వెంకటేష్ తప్పక వస్తాడనే నమ్మకంతో స్కూలుకి రెండు రోజులు సెలవు పెట్టాను. నా శ్రీమతి, పిల్లలూ ప్రయాణ సన్నద్ధులయ్యారు... వెంకటేష్ వస్తాడని ఆ రోజు సాయంత్రం దాకా ఎదురు చూశాం. రాలేదు సరికదా, ఫోన్ కూడా చెయ్యలేదు. ఎందుకనో ఈసారి మాత్రం నామనస్సు తీవ్రంగా గాయపడింది.

★ ★ ★

కాలచక్రం గిర్రున తిరుగుతోంది. ఒకరోజు రాత్రి పదిగంటల ప్రాంతంలో ఫోన్ మ్రోగింది. 'వేటపాలెంలో అత్తగారు చనిపోయినట్లు' మా అన్న చెప్పాడు. శ్రీమతికి విషయం చెప్పాను. "వెళ్తారా?" కుతూహలంగా అడిగింది. చూద్దాం లే..." అనాసక్తంగా అన్నాను.

'కడుపునొప్పి' అంటున్నావుగా... పద ఆసుపత్రికెళ్దాం అన్నాడు చింటూతో తండ్రి.

వద్దు... డాడీ... ఇవాళ స్కూల్ మానేసి రెస్ట్ తీసుకుంటే అదే తగ్గిపోతుంది... గడుసుగా సమాధానం ఇచ్చాడు చింటూ.

తెల్లవారింది. నేను వేటపాలెం పోలేదు. మామూలుగా స్కూలుకు బయలుదేరాను. ఎందుకనో వేటపాలెం పోవడానికి నామనస్సు అంగీకరించలేదు. అచ్చటకు వెళ్లినా, వెళ్లకపోయినా జరగాల్సిన కార్యక్రమాలు ఆగవు కదా! కానీ అవసరాలకు పిలవటం, చులకన భావంతో శుభకార్యాలకు ఆహ్వానించకపోవడం - మనుషులెంత దుర్మార్గంగా మారిపోయారు? అనుబంధాలు, ఆత్మీయతలూ అంతా బూటకమేనా?

ఇది నా ఒక్కడి కథే అనుకోలేకపోతున్నాను. నాలాగా ఆత్మీయతా దాహంతో, మంచు పువ్వుల్లాంటి మంచి మనస్సులతో జీవితాలు నిజాయితీగా గడపాలనుకునే ఎందరో ఇలాంటి చేదు అనుభవాలతో చింతిస్తూండవచ్చు. ఈ కథల్లో పేర్లు తప్ప మిగతా అంతా ఒకటేగా ఉంటుంది.

ఏముంది ఈ కథలో? అనుకోవచ్చు. జీవితం ఉంది. జీవితంలో అనుభవానికి వచ్చే చేదు నిజం ఉంది.

జీవితం మధురంగా ఉండాలంటే మనుషుల్లోని మానవత్వం మళ్లీ చిగురించాలి. చిగురిస్తుందా?

ఏమో...? మీ అనుభవాలను గురించి మీరే చెప్పాలి! ●